క్లుప్తంగా

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం నివేదించారు. అనంతరం భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం విశేష హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మత్రిపాలెం : జీవీఎంసీ 50వ వార్డు మాధవధార మెయిన్ రోడ్డులో విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దాన్ని ఈఈ బీకే నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు, ఎండా కాలంలో సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేదుకు మాధవధార పరిసర ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా చూసేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ శివసత్యనారాయణ, ఎస్ఎస్‌టీఎల్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పతకాలు సాధించిన అథ్లెట్స్‌కు అభినందనలు



జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విశాఖ మాస్టర్స్ అథ్లెట్స్

మురళీనగర్ : రాజస్థాన్ రాష్ట్రం ఆళ్వార్‌లోని రాజ్ రిషీ కాలేజీ మైదానంలో నిర్వహించిన '44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ – 2025'లో విశాఖ వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ మంగ వరప్రసాద్ నేతృత్వంలో 102 మంది పాల్గొనగా విశాఖపట్నం వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నుంచి 33 మంది పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ఎం.రామారావు, వై.గంగాధర్, సీహెచ్.వేణు, కేబీఎం కృష్ణ ప్రసాద్, బి.గణేష్, కె.విశ్వనాథ్, యు.అప్పన్న దొర, మహిళా విభాగంలో జల ఉష, ఏపీవీ రామలక్ష్మి, కె.మత్స్య కొండ, పూర్ణిమ, డి.సరోజ పాల్గొన్నారు. వివిధ విభాగాల క్రీడా పోటీల్లో పాల్గొన్న వీరు 5 స్వర్ణ, 7 రజిత, 10 కాంస్య పతకాలు సాధించి విశాఖ కీర్తిని చాటారు. ఈ సందర్భంగా విశాఖపట్నం వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (వావ్ అసోసియేషన్) న్యూ చీఫ్ పేటర్న్ కమల్ బైద్, న్యూ చీఫ్ అడ్వైజర్ చింతలపాటి సత్యదేవ్, కో – ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు, పీఆర్‌వో వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు అభినందనలు తెలిపారు.

ఎరుకుమాంబ ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి పర్యవేక్షణలో శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎరుకుమాంబ అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో హరిహరనామ సంకీర్తన, ఏకాహ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భజన బృందాలుచే గీతాలాపనలు, సంకీర్తనలు జరిగాయని ఆలయ ఈవో జి.వి.రమాభాయి తెలిపారు. ఈ భజన కార్యక్రమం ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలూ కొనసాగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం.. శ్రీలలితాపీఠం



లలితాదేవికి బంగారు చీర అలంకరిస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి



శాకంబరి అలంకారంలో లలితాదేవి



లలితాపీఠం మణిద్వీపంలో అమ్మవారి శ్రీచక్రం

- వేదమంత్రాలతో విరాజిల్లుతోన్న శ్రీలలితాపీఠం
- 9 దశాబ్దాలుగా విశేష పూజలు, హోమాలు
- నేటి నుంచి 76వ బ్రహ్మోత్సవాలకు సిద్ధం
- ప్రత్యేకంగా అలంకరించిన నిర్వాహకులు

సీతంపేట : శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. అక్కయ్యపాలెం లలితానగర్‌లో కొలువైన శ్రీలలితాపీఠం దైవారాధన, నిత్యం వేద మంత్రాలతో సమస్త దేవతలకు విశేష పూజా కార్యక్రమాలు, అన్నసమారాధన, హోమాలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక ప్రదేశంగా విరాజిల్లుతోంది. 1931లో దక్షిణామూర్తి మహరాజ్ అక్కయ్యపాలెం లలితానగర్‌లో పీఠం స్థాపించారు. నేడు 76వ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుపుకోనుంది. ఆదివారం నుంచి ఈ నెల 12 వరకు నాలుగు రోజులపాటు విశేష పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా లలితాపీఠంలోని ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు విద్యుత్ దీపాలు, పూలదండలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

9 దశాబ్దాల్లో దినదినాభివృద్ధి చెందుతూ...

అక్కయ్యపాలెం లలితానగర్‌లో కొలువైన శ్రీలలితాపీఠం ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రదేశంగా గుర్తింపు పొందింది. పీఠం ప్రథమ పీఠాధిపతి దక్షిణామూర్తి మహారాజ్ 1931లో లలితానగర్‌లో పీఠాన్ని స్థాపించారు. పీఠంలో 16 ఉప ఆలయాలు ఉన్నాయి. వీటిలో లలితాదేవి ప్రధానమైన దేవతగా పూజలందుకుంటున్నారు. లలితాదేవి విగ్రహాన్ని 1949లో నవంబరు 2న ప్రతిష్టించారు. అప్పటి నుంచి ఈ ప్రాంతానికి లలితానగర్‌గా పేరొచ్చింది. జగద్గురు శ్రీఆది శంకరాచార్య పంచాయతన పూజా విధానం శ్రీలలితాపీఠంలో అనుసరిస్తున్నారు. ప్రథమ పీఠాధిపతి తర్వాత ఆయన శిష్యుడు అవ్యక్తానంద మహారాజ్ 1956లో రెండో పీఠాధిపతి అయ్యారు. అతని పేరు మీద అవ్యక్తానంద దర్బార్ హాల్ నిర్మించారు. విశేష పూజా కార్యక్రమాలు, మహోత్సవాలకు దీనిని ఉపయోగిస్తున్నారు. అనంతరం 1998లో కుర్తాళం సిద్ధేశ్వరి పీఠంలోని శివచిదానంద భారతి స్వామి తృతీయ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన హయాంలో పీఠంలో షిర్డీ సాయిబాబా, సీతారామ, గణేష్, శివ, నాగేంద్ర, మౌనస్వామి, శ్రీకృష్ణుడి విగ్రహాలు ఏర్పాటుతో పీఠం అభివృద్ధి చెందింది. అనంతరం ఆయన వారసుడు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 2002లో నాలుగో పీఠాధిపతి అయ్యారు. ఈయన హయాంలో పీఠాన్ని విశేషంగా అభివృద్ధి చేశారు. పీఠం ప్రాంగణంలో మణి ద్వీపాన్ని నిర్మించి లలితా అమ్మవారి శ్రీచక్రం ప్రతిష్టించారు. మణిద్వీపంలో గాయత్రి, దుర్గ, అన్నపూర్ణేశ్వరి, సరస్వతి, కామేశ్వర, గణపతి, వారాహి, మహాలక్ష్మి, సరస్వతి, మధుర మీనాక్షి, రాజశ్యామల, దుర్గ, దేవతల విగ్రహాలు ప్రతిష్టించారు. అలాగే పీఠం మొదటి, రెండో గురువులకు మందిరాలు నిర్మించారు. శ్రీమేధా దక్షిణామూర్తి, దత్తాత్రేయ, హయగ్రీవ, అగస్త్య మహాముని, స్వామి అయ్యప్ప, పూరీ జగన్నాథ్, జగన్నాథస్వామి, నవగ్రహ మండపం, గోశాల, యాగశాల, కాళీ కాలభైరవవులు, ప్రత్యంగిరా దేవి, శ్రీ వేంకటేశ్వర స్వామి, రమా సత్యనారాయణస్వామి, నరసింహ స్వామి విగ్రహాలు ప్రతిష్టించి నిత్యం పూజలు, విశేష హోమాలు నిర్వహిస్తున్నారు.

అమ్మవారికి బంగారు చీర

గత ఏడాది 75వ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు, దాతల సహకారంతో లలితా అమ్మవారికి 2 కిలోల బంగారంతో చీర చేయించారు. కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా బంగారు చీరను ఆవిష్కరించి, అమ్మవారికి అలంకరించారు. అప్పటి నుంచి ముఖ్యమైన పర్వదినాల్లో అమ్మవారికి బంగారు చీర అలంకరిస్తున్నారు.

ఏటా నిర్వహించే పూజా కార్యక్రమాలివీ

- ఫిబ్రవరి నెలలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.
- ధనుర్మాసం నెల రోజులు పాశురాలు, కూడారై, వైకుంఠ ద్వార దర్శనం, గోదా కల్యాణంతో మహోత్సవాలు ముగిస్తారు.
- కార్తీక మాసం నెల రోజులు శివునికి అభిషేకాలు, ఏకవార అభిషేకాలు, రుద్రాభిషేకాలు, దీపారాధన, చండీ పారాయణ చేస్తారు.
- సుబ్రహ్మణ్య షష్ఠి రోజున సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం వైభవంగా జరిపిస్తారు.
- వసంత పంచమి రోజున సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తారు.
- దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, శత చండీ యాగం, రోజూ విశేష హోమాలు జరుపుతారు.
- భాద్రపద పౌర్ణమికి కాళీ కాలభైరవ కల్యాణం నిర్వహిస్తారు.
- శ్రీకృష్ణాష్టమి వేడుకలు, శ్రావణ మాసం, మార్గశిర మాసంలో లలితా అమ్మవారికి విశేష పూజలు చేస్తారు.
- ఆషాడమాసంలో వారాహి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.
- ప్రతీ శుక్రవారం కర్ణాటక గాత్ర కచేరి చేస్తారు.
- చైత్ర మాసంలో సీతారామ కల్యాణం జరిపిస్తారు.



విద్యుత్ కాంతులతో శ్రీలలితాపీఠం



ధనుర్మాసంలో పాశురాలు చదువుతున్న భక్తులు



పీఠంలో నిర్వహిస్తున్న ప్రత్యంగిరా హోమం (ఫైల్)



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు

బడ్జెట్‌పై మేధావుల చర్చ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేసీ రెడ్డి

సీతంపేట : సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ (సిడార్), లంకపల్లి బుల్లయ్య కళాశాల సంయుక్తంగా క్యాంపస్‌లో కేంద్ర బడ్జెట్‌పై చర్చా సమావేశం శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆర్‌జీయూకేటీ మాజీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఆర్.సుదర్శనరావు, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ వంటి మేధావులు పాల్గొని బడ్జెట్‌పై చర్చించారు. ఆదాయపు పన్ను చిక్కులు, ఆర్థిక వృద్ధి, విద్య, విదేశీ వాణిజ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల పెట్టుబడి తదితర అంశాలపై చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లు, నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతపై ప్రసంగించారు. బడ్జెట్‌లో పర్యావరణ స్థితి స్థాపనకు సమగ్ర విధానం లేదని, వాతావరణ మార్పులు తగ్గించడానికి తగినంత కేటాయింపులు లేవని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



బల్లల పండగలో కేకే రాజు, తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం బల్లల పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో రజకులు నక్కవానిపాలెం నుంచి సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్సన్ మీదుగా బాలయ్యశాస్త్రి లే అవుట్, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ దరి శ్రీ వీరభద్రస్వామి దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. యువకులు ఆనందోత్సాహాలతో నృత్యాలు చేశారు. అనంతరం అక్కడ ఘటాలు ఉంచి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు, శ్రీ కనకమహాలక్ష్మి రజక సేవా సంఘం, శ్రీరామ రజక సంక్షేమ సేవా సంఘం, శ్రీ లోవాతల్లి రజక సంఘం, శ్రీ వీరాంజనేయ రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

- రజకుల బల్లల పండగలో వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వీకేపీసీఐఆర్ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, టీడీపీ నేతలు వెల్లంకి భరత్, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో విజయోత్సవాలు



విజయోత్సవాల్లో శ్యామలాదీపిక, తదితరులు

సీతమ్మధార : ఢిల్లీలో 27 సంవత్సరాల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ విజయం సాధించడం చరిత్రాత్మకమని ఆ పార్టీ నాయకురాలు శ్యామలా దీపిక అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని పురస్కరించుకుని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల కార్యాలయంలో శనివారం విజయోత్సవాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని అమలు చేస్తున్న పథకాలు ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నాయన్నారు. అక్కడి తెలుగు ప్రజలు కూడా బీజేపీ విజయానికి కృషి చేశారని ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో మద్యం కుంభకోణానికి పాల్పడిన ఆప్ ప్రభుత్వానికి ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడేశారన్నారు. కార్యక్రమంలో రాంబాబు, పద్మజ, ఎస్.రామకృష్ణ, అరుణ్‌బాబు, దుర్గారావు, శంకరరావు, మల్లికార్జునరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు సిరాజ్‌ని అప్పగిస్తున్న హెచ్‌సీ సత్యనారాయణ, తదితరులు

సీతమ్మధార : హైదరాబాద్‌కి చెందిన వ్యక్తిని ఎట్టకేలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానసిక ఆరోగ్యం సరిగ్గా లేక హాస్పిటల్‌కి అని చెప్పి విశాఖ వచ్చిన మొహమ్మద్ సిరాజ్ (55)కు ఫోర్తుటౌన్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సమాచారంతో ఏయూటీడీ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ షెల్టర్‌లో గతంలో ఆశ్రయం కల్పించారు. అనంతరం అతని వద్ద ఉన్న ఫోన్ నంబర్‌తో వారి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు శనివారం ద్వారకానగర్ టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి చేరుకున్నారు. ఈ మేరకు వసతిగృహంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సమక్షంలో సిరాజ్‌ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

10న సుంకర నామినేషన్

సీతంపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఈ నెల 10న నామినేషన్ వేయనున్నట్టు విద్యావేత్త డాక్టర్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా వీరిబాబు పరస



అక్కయ్యపాలెంలో భక్తులకు వడ్డన చేస్తున్న ఆలయ వ్యవస్థాపకులు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని జగన్నాథపురం అమ్మవారి గుడి వద్ద శ్రీవరాహలక్ష్మి గణపతి ఆలయ 25వ వార్షికోత్సవం, శ్రీవీరిబాబు తులసికోట పరస మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. బొడ్డేటి భాగ్యలక్ష్మి కుమారుడు బొడ్డేటి అప్పారావు ఆధ్వర్యంలో పరస నిర్వహించారు. ముందుగా గణపతి హోమం, వరాహ లక్ష్మీ గణపతికి అభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద 1500 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం గరిడీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం (అక్కయ్యపాలెం) చైర్మన్ రాజగిరి అప్పలరాజు, అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, పి.ఎస్.జె.వి.ప్రసాద్, పొలమరశెట్టి గోపాల్, రామకృష్ణ, వెంకటరావు, వెంకట అప్పారావు, పూర్ణచంద్రరావు, పారుపల్లి రవి, రాజేంద్రప్రసాద్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పరస ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పారిశుధ్య కార్మికులకు భోజనాలు

మురళీనగర్ : మురళీనగర్‌లోని శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల్లో నిత్యం పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ మధ్యాహ్నం భోజనం అందించారు. అనంతరం వారిని సత్కరించారు. జీవీఎంసీ వర్కర్ సూర్యనారాయణకు నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ సింహాచలం, చిరంజీవి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాట్యోత్సవం



చిన్నారులతో నాట్య గురువులు

సీతంపేట : శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, టీటీడీ పూర్వ ఈవో, తెలంగాణా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినం సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ సంగీత నాట్యోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది చిన్నారులు చేసిన సంగీత, నృత్య ప్రదర్శన అలరించింది. వీరికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నాట్య గురువులు తాళ్లపాక సందీప్‌కుమార్, ఎ.కృత్తిక, కె.కరుణామోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మీగడ శశిభూషణ స్వామి, ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌందర్య, సన్మూర్తి, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎం.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇంటికి చేరిన ఇండోర్ మహిళ



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యులు

సీతమ్మధార : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సిటీకి చెందిన పార్వతి (65) అనే వృద్ధురాలిని శ్రద్ధా టీం సభ్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమెకు ముగ్గురు కొడుకులు, కోడళ్లు ఉన్నప్పటికీ కొన్నాళ్ల కిందట విశాఖ వచ్చేసింది. గత ఏడాది అక్టోబర్ 5న ఆమెను రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ద్వారకానగర్‌లో గల టీఎస్‌ఆర్ కాంప్లెక్సులోని జీవీఎంసీ – ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కి తరలించారు. అనంతరం ఆమె వివరాలు సేకరించి ఇండోర్‌లో నివసిస్తున్న కొడుకు జితేంద్ర చౌహాన్ వద్దకు శనివారం తీసుకెళ్లి అప్పగించామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత



డైరీ ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట : బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రూపొందించిన డైరీ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఫోరం అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ ప్రధానమంత్రి బాల పురస్కార అవార్డు గ్రహీత ఆకుల సాయి సంహిత, అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడాకారిణి బొల్లాప్రగడ శ్రీసాహితి, జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ వి.వి.వామనరావు, సౌత్ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు, కేజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామనరావు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, ఉల్లంఘనాంశాలపై ఫోరం దృష్టి సారించాలన్నారు. సాయి సంహిత, శ్రీసాహితి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేలా ఆటలను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు, చైల్డ్ రైట్స్ ఫోరం కృషి చేయాలని సూచించారు. గొండు సీతారాం మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ ఫోరం తనదైన శైలిలో వ్యవహరించి రాష్ట్రంలో చక్కని బాలల సంఘంగా పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె.ఎల్లయ్య, బి.లవకుశ, ప్రవీణ, బి.సంతోష్, కరుణాకర్, ఎం.హరీష్ కుమార్, బచ్చు లక్ష్మణారెడ్డి పాల్గొన్నారు.

మద్రాస్ ఫిల్టర్ కాఫీ పేరిట బోగస్ ఫ్రాంచైజీలు



మీడియాతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

సీతమ్మధార : మద్రాస్ ఫిల్టర్ కాఫీ పేరిట బోగస్ ఫ్రాంచైజీలు ఇస్తూ వ్యాపారులను దోచుకుంటున్న విజయవాడకు చెందిన కార్తీక్ మీద విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని మద్రాస్ ఫిల్టర్ కాఫీ బ్రాండ్ యజమాని పరుచూరి యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురుద్వారా సమీపంలోని ఓ హోటల్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తనకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 30కిపైగా మద్రాస్ ఫిల్టర్ కాఫీ అవుట్‌లెట్లు ఉన్నాయని తెలిపారు. కార్తీక్ అనే వ్యక్తి మద్రాస్ ఫిల్టర్ కాఫీ నకిలీ లోగోలతో, నకిలీ ఇన్‌స్టాగామ్, ఫేస్ బుక్ ఐడీలతో పలువురు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కార్తీక్ మీద ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడు కేసులున్నాయని గుర్తు చేశారు. కార్తీక్ వలలో చిక్కుకున్న ఎందరో డబ్బులు పోగొట్టుకుని రోడ్డున పడ్డారని విచారం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో బాధితుడు నరేష్, చైతన్య, సూర్య చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా మాధవుని కల్యాణ మహోత్సవం



లీలామాధవస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మత్రిపాలెం : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో కొలువైన లీలా మాధవస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సహిత లీలామాధవస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సింహాచలం దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో మాధవస్వామి అర్చకుల పర్యవేక్షణలో కల్యాణం నిర్వహించారు. అనంతరం రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాల స్వామి ఆలయంలో సింహాచలం దేవస్థానం అర్చకులు వేదమంత్రాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మాధవ యువజన సంఘం భజన కళాకారులు భక్తులను అలరించారు. కార్యక్రమంలో అర్చకులు సనపల వరాహ నరసింహం, శ్రీనివాస్, గోవిందస్వామి, ఆలయ వంశపారపర్య అర్చకులు సనపల రవీంద్రకుమార్ పాల్గొన్నారు.